ఉపాధిహామీ పనులు కల్పించాలి

మాట్లాడుతున్న డీఆర్డీవో సురేందర్

పెంచికల్ పేట్, మార్చి 27: ఉపాధిహామీ పథకం ద్వారా చెబడుతున్న పనుల్లో జాబ్ కార్డ్ ఉన్న ప్రతి కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించాలని డీఆర్డీవో పీడీ సురేందర్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 100 రోజుల పని కల్పనతో పాటు రూ.272 కూ వేతనం అందేలా పనులు చేయించాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఆర్థిక సంత్సరం ప్రారంభం అవుతుంది కావున ప్రతి గ్రామంలో పనులను గుర్తించి సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను చేరుకోవాలని అధికారులకు సూచించారు. పని ప్రదేశంలో ముఖ్యంగా వేసవికాలం ఎండ వేడిని దృష్టిలో ఉంచుకుని తాగు నీటి వసతి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆల్బర్ట్, ఏపీవో సతీశ్, ఈసీ జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు చేయండి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే
- అధికారులతో సమీక్షా సమావేశం

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 27: రైతుల నుండి వరి ధాన్యం కొనేందుకు కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దౌత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఏప్రిల్ 1వ తేదీన కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. కేంద్రాల వద్ద రైతులకు నీడ, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. గన్నీ సంచులు సమకూర్చడంతో పాటు టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. నిబంధనల ప్రకారం తప్ప, తాలు, తేమ శాతాన్ని పరిశీలించుకొని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు వివరాలను వెంటవెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. మే 15వ తేదీలోగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా చూడాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనుకూల రకాలను ఎంచుకోవాలి

- డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ పీ రఘురాంరెడ్డి
- ఉత్తర తెలంగాణ మండల పరిశోధన, విస్తరణ సలహా సమావేశం

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

జగిత్యాల టౌన్, మార్చి 27 : ఉత్తర తెలంగాణ మండల రైతులు పంటలను సాగు చేసేముందు వాతావరణ అనుకూల రకాలను ఎంచుకోవాలని డైరెక్టర్ ఆఫ్ రీసర్చ్ డాక్టర్ పీ రఘురాంరెడ్డి తెలిపారు. పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో బుధవారం విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకుడు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకుడు డాక్టర్ సుధారాణితో పాటు అనుబంధ శాఖల అధికారులతో ఉత్తర తెలంగాణ మండల పరిశోధనా విస్తరణ సలహా సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురాంరెడ్డి మాట్లాడుతూ.. సరైన శాస్త్రీయ, సాంకేతిక యాజమాన్య పద్ధతులను రైతులు పాటించడం వల్ల అనుకున్న దాని కంటే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు ఒక్క వరి పంటపైనే ఆధారపకుండా ఇతర రకాలను కూడా ఎంచుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ఎక్కువ అవసరం ఉన్న పంటలపై దృష్టి పెట్టడం వల్ల రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. పరిశోధనా స్థానం ద్వారా రైతులు సూచనలు, సలహాలు తీసుకోవడం వల్ల పంట నష్టం జరుగకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అవసరానికి అనుకూలంగా మాత్రమే ఎరువులు, పురుగు మందులను వాడాలని సూచించారు. పురుగు మందులను ఎక్కువ మోతాదులో వాడకుండా పురుగులను గుర్తించి, వాటి నివారణకు సరియైన మందులను మాత్రమే వాడాలని వివరించారు. అనంతరం పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం సంచాలకుడు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతేడాది జరిగిన పరిశోధనా ఫలితాలను రైతులకు వివరించారు. వరి, చెరుకు, పత్తి, సోయ, శనగ వంటి పంటలపై పరిగిన పరిశోధనలను రైతులకు వివరించారు. గతేడాది వాతావరణ మార్పులు, వర్షాపాతం, ఏ జిల్లాలో ఏ మోతాదులో ఉన్నదో సూచిస్తూ చీడపీడల వ్యాప్తితో ఎంత మోతాదులో పంట నష్టం జరిగిందో తెలిపారు. అనంతరం రైతుల ప్రశ్నలకు వివిధ పంటల్లో ఏర్పడ్డ మార్పులపై ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ మంజులత వివరించారు. ఆదిలాబాద్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్ విస్తరణకు సంబంధించిన ఫలితాలను రైతులతో చర్చించి, వాటి ఫలితాలను వివరించారు. ఉత్తర తెలంగాణలోని 10 జిల్లాల వ్యవసాయ అధికారులు వారి జిల్లాల్లో ఉన్న పంటలు, ఆ పంటల్లో ఉన్న సమస్యలను, చిరుసంచుల దశలో ఉన్న వివిధ రకాల పంటల రకాల ఫలితాలను ప్రజెంటేషన్ రూపంలో వివరించారు. ఈ సమావేశంలో సుమారు 250 మంది రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు, యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్తలు, యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు

విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టొద్దు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇంజినీర్ గౌతమ్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 27: పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవీ విద్యుత్ లైన్ల కింద పంట మిగులును తగులబెట్టవద్దని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇంజినీర్ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. విద్యుత్ లైన్ల కింద పంటలు పండించే రైతులు చేనులో మిగిలిన చెత్తను కాల్చివేసే క్రమంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఆసిఫాబాద్ లోని అంకుసాపూర్, బలన్పూర్, చెర్పల్లె, గుండి, నండుప, రాపల్లె, సమేలా, సంకెపల్లె గ్రామాలు, దహెగాం మండలంలోని ఇటియాల్, కాగజ్‌నగర్ లోని అంబోడ, బోడెపల్లె, దుబ్బగూడ, ఈజ్ గాం, గన్నారం, జంబూగ, మాండ్వ, మోసం, నాగంపేట్, నజ్రుల్ నగర్, రాస్పల్లి, వల్లకొండ, రెబ్బెన మండలంలోని ఫకీర్ పల్లె, గంగాపూర్, జక్కల్పల్లె, ఖైర్గాం, కిష్టాపూర్, కొమరవెల్లి, మేడిగూడ, నంబాల, నారాయణపూర్. నవేగాం, రాజారం, రాంపూర్, రంగాపూర్, రెబ్బెన, రాళ్ళపేట గ్రామాలు, సిర్పూర్ (టి) మండలంలోని అచ్చల్లి, ఆరెపల్లె, చింతకుంట, చుంచుపల్లె, హీరాపూర్, లక్ష్మీపూర్, రుద్రరామ్, సిర్పూర్, వెంకటరావ్ పేట్ గ్రామాలు, వాంకిడి మండలంలోని బంబారా, బోరాంజిగూడ, గోవాగాం, కన్నెరాగాం, ఖమానా, ఖేడేగాం, కోమటిగూడ, నవేగాం, నీమ్‌గాం, సమేలా, వాంకిడికాలాన్, వాంకిడిఖుర్దు గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల కింద పంట సాగు చేసే రైతులు ఎక్కువగా ఉన్నారని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద మంటలు పెడితే కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, సమీపంలోని జంతువులు, మానవులకు హాని జరిగే ప్రమాదం ఉందంటున్నారు. రైతులు గమనించి ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ లైన్ల కింద మంటలు పెట్టవద్దని కోరారు.

నిరుద్యోగ యువతకు మూడు నెలల ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 27: ఎస్సీ అభివృద్ధి శాఖ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గ్రూప్స్-1, 2, 3, 4, ఎస్ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర రాష్ట్ర, కేంద్రస్థాయి ఉద్యోగాల కోసం స్పెషల్ ఫౌండేషన్ కోర్స్ ద్వారా మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు కాగజ్‌నగర్‌లోని సాయితేజ డిగ్రీ కళాశాల స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఎంపికతో పాటు, అభ్యర్థులకు డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు రెసిడెన్షియల్ వసతితో కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ కుల, ఆదాయ, పదో తరగతి, డిగ్రీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో స్పాట్ అడ్మిషన్లకు రావాలని అభ్యర్థులకు సూచించారు. ఇతర వివరాలకు వసతి గృహ సంక్షేమ అధికారులను 99852 74060, 82472 99217 నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్‌సెర్చ్

- కౌటాల సీఐ సాధిక్‌పాషా
- లంబడిహెట్టిలో కార్డెన్‌సెర్చ్

లంబడిహెట్టిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సాదిక్ పాషా

చింతలమానేపల్లి, మార్చి 27 : శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కౌటాల సీఐ సాధిక్‌పాషా తెలిపారు. బుధవారం లంబడిహెట్టి గ్రామంలో ఇంటింటా సోదాలు చేయగా ఆరుగురి వద్ద గుడుంబా లభించిందని ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. అనంతరం సీఐ గ్రామస్తులకు పార్లమెంట్ ఎన్నికల కోడ్ గురించి అవగాహన కల్పించారు. గుడుంబా అమ్మినా, తయారు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో దొంగతనాలు అధికంగా జరుగుతున్నాయని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుమానిత వ్యక్తులు కనబడితే సమాచారం అందించాలన్నారు. యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించడం, నేరాలు నిర్మూలించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. గుట్కా, గంజాయి సాగు, అమ్మకం, కలప అక్రమ రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ తదితర నేరాలకు పాల్పడితే వారి సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. ఇక్కడ ఎస్ఐలు నరేశ్, మధుకర్, ఏఎస్ఐ యాదవ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లి రైల్వే గేటు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్

వేంపల్లి రైల్వే గేటు వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

సిర్పూర్(టీ), మార్చి 27 : సిర్పూర్(టీ)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారి వేంపల్లి గ్రామ సమీపంలోని రైల్వే గేటును బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో రైల్వే గేటు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ప్రయాణికులు రెండు గంటల పాటు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సిర్పూర్(టీ), కాగజ్‌నగర్ వైపు కిలో మీటరు మేరకు వాహనాలు ఆగిపోయాయి. రైల్వే గేటు మరమ్మతులను రైల్వే అధికారులు చేపట్టిన ఆనంతరం వాహనదారులు, ప్రయాణికులు తమ ప్రయణాలు సాగించారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలి

ఇందారం ఓపెన్‌కాస్ట్ పని ప్రదేశాలను పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్, మార్చి 27: సింగరేణిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి, అధికారి రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని ప్రాజెక్టులు, ప్లానింగ్ డైరెక్టర్ జీ వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. బుధవారం శ్రీరాంపూర్ ఆర్కే -7 గనిని జీఎం సంజీవరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి క్వారీలో పని స్థలాలు పరిశీలించారు. ఆర్కే -7 గనిలోకి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం మ్యాన్ రైడింగ్ ద్వారా దిగారు. గనిలోని 2వ సీంలో పనిచేస్తున్న కార్మికులతో మాట్లాడి పని ప్రదేశాల్లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించి ఓసీపీ ఓబీ కాంట్రాక్టు సంస్థలు సీఆర్ఆర్, జీవీఆర్ ప్రతినిధులతో మాట్లాడారు. వారికి కేటాయించిన రోజువారీ మట్టి తవ్వకాలు(ఓబీ) తరలింపు లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏరియా ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, పీవో శ్రీనివాస్, ఆర్కే -7 ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ శ్రీధర్, ఓసీపీ మేనేజర్ బ్రహ్మాజీ, ఈఈ చంద్రశేఖర్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్వే ఆఫీసర్ సంపత్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధించాలి

జైపూర్, మార్చి 27: లక్ష్యం మేరకు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సింగరేణి ప్లానింగ్, ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి ఇందారం ఓపెన్‌కాస్టు గనిని సందర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉపరితల గనిలో నాలుగు రోజుల్లో ఓబీ ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని ఆదేశించారు. ఓబీ ఎంత ఎక్కువ తీస్తే బొగ్గు అంత ఎక్కువ రవాణా చేయడానికి అవకాశం ఉంటుందని సంబంధిత ఓబీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్, గ్రూప్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఉపరితల గని మేనేజర్ రవికుమార్, ప్రాజెక్టు ఇంజినీర్ రమేశ్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

నర్సరీను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

కెరమెరి, మార్చి 27: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న నర్సరీలోని మొక్కలు ఎండకాలం వాడిపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. బుధవారం మండలంలోని మెట్ట పీప్రీ, దేవాపూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈజీఎస్ పథకంలో కూలీల సంఖ్య పెంచి, పని ప్రదేశంలో తగిన సౌకర్యాలు కల్పిస్తూ ఇబ్బందులు లేకుండా చేయాలని టీఏ, ఎఫ్ఏలకు సూచించారు. కొలతల ప్రకారం నాణ్యమైన పనులు చేస్తూ, చేసిన పని ప్రదేశంలో వివరాల బోర్డు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది కూలీలు ఉన్నారు.

సమాచార సేకరణలో కార్యదర్శులు

సమగ్ర సమాచారాన్ని పూర్తిస్థాయిలో సేకరింస్తున్న కార్యదర్శులు

వాంకిడి, మార్చి 27:పంచాయతీ కార్యదర్శులు మండల సమాచారం సేకరించి పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.దీంతో బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యలయంలో మండలంలోని కార్యదర్శులు అన్ని శాఖల నుంచి మండలానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

నేడు ఇసుక వేలం

రెబ్బెన, మార్చి 27: మండలంలో పులు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన, సీజ్ చేసిన ఇసుకను 28వ తేది గురువారం వేలం నిర్వహించటం జరుగుతుందని తహసీల్దార్ జ్యోత్స్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదిన ఇందిరానగర్, గొల్లగూడ, రెబ్బెన ప్రాంతాల్లో 190 ట్రాక్టర్ల ఇసుకను విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను గంగాపూర్ పశువుల సంత వద్ద రెవెన్యూ అధికారులు నిల్వ చేసినట్లు తెలిపారు. అసక్తి గలవారు వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పూడికతీత పనులు ప్రారంభం

వట్టివాగు కెనాల్ పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

రెబ్బెన, మార్చి 27: మండలంలోని వట్టివాగు కెనాల్ పూడికతీత పనులు బుధవారం ప్రారంభమైనట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు లావుడ్య రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం దేవాజీలు పేర్కొన్నారు. వట్టివాగు కెనాల్ కింద సాగు చేసుకుంటున్న రైతులు, పార్టీ నాయకులు వట్టివాగు కెనాల్ సమస్య కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు దృష్టికి తీసుకవెళ్లారు. నక్కలగూడ, పుంజుమేరగూడ, ఇంద్రనగర్, రెబ్బెన ఆయకట్టు రైతుల పోలాలకు సాగు నీరు అందించాలని కలెక్టర్ వెంకటేశ్‌దౌత్రే దృష్టికి కాంగ్రెస్ నాయకులు తీసుకవెళ్లగా స్పందించిన కలెక్టర్ సింగరేణి సహకారంతో పూడిక తీత పనులు ప్రారంభించాలని సూచించటంతో పనులు ప్రారంభం అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి పీవో ఉమాకాంత్, జేఈ జానీ, నాయకులు వనమాల మురళీ, మిట్ట దేవేందర్, చౌదరి కిరణ్, అజ్మీర అశోక్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

నాగేశ్వరి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో విద్యార్థిని కే నాగేశ్వరి ఢిల్లీ లో నేటి(గురువారం) నుంచి వచ్చే నెల 2 వరకు నిర్వహించే జాతీయ స్థాయి సీనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు జిల్లా గిరిజన క్రీడా అధికారి బండమీనారెడ్డి, పాఠశాల హెచ్ఎం కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 8 నుంచి 11వరకు యాదాద్రి భువనగిరిలో 56 వ రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో చాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఈనెల 16 నుంచి 25 వరకు రంగారెడ్డి జిల్లా పరిగిలో జరిగిన రాష్ట్ర జట్టు శిక్షణ శిబిరంలో పాల్గొని, తెలంగాణ జట్టు తరపున జాతీయస్థాయి పోటీల్లో బరిలోకి దిగుతున్నట్లు పేర్కొన్నారు, ఖోఖో శిక్షకుడు వాసం తిరుమల్, నాగేశ్వరిని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్. రమాదేవి, ఏసీఎంవో పీ ఉద్దవ్ ఏటీడీవో క్షేత్రయ్య, జీసీడీవో శకుంతల, పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆర్వోబీ గ్యాడర్ పనులు ప్రారంభం

వేంపల్లి వద్ద కొనసాగుతున్న ఆర్వోబీ గ్యాడర్ పనులు

సిర్పూర్(టీ), మార్చి 27 : మండలంలోని సిర్పూర్(టీ)-కాగజ్‌నగర్ రహదారి మధ్యలోని వేంపల్లి రైల్వే ఆర్వోబీ గ్యాడర్ పనులను బుధవారం రైల్వే అధికారులు ప్రారంభించారు. ఎనిమిదేండ్లుగా కొనసాగుతున్న ఆర్వోబీ పనులు ఎట్టకేలకు తుదిదశకు చేరుకున్నాయి. ఆర్వోబీ స్లాబ్ పనుల్లో భాగంగా బుధవారం అధికారులు రెండు గ్యాడర్లను బిగించారు. మరో రెండు గ్యాడర్లను బిగించాల్సి ఉంది. ఈ రెండు గ్యాడర్లను కూడా గురువారం బిగించవచ్చని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

బెల్లంపల్లి, మార్చి 27 : కన్నాల 363 జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆర్డీవో హరికృష్ణ సూచించారు. ఇటీవల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో జాతీయ రహదారులు, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. యూ టర్న్ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిపై రాష్ డ్రైవింగ్, ఇతర ప్రమాదాలు జరిగే వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. జాతీయ రహదారిపై ఉన్న వైన్‌షాప్‌కు ఉన్న అనుమతులపై విచారణ జరిపించాలని మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డిని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కన్నాల జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన ప్రమాదాల్లో ఏడుగురి మృతికి కారణమైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు మాస మురళి, చిలుక రాజనర్సు ఆర్డీవోను కోరారు. బాధిత కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన వైన్‌షాప్‌ను తొలగించాలని మాజీ సర్పంచ్ మంద అనిత కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, బెల్లంపల్లి రూరల్ సీఐ అష్టలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.